విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

నేడు స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం 'స్పందన' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం యధా విధిగా నిర్వహించబడుతుందన్నారు.

9న గౌడ సంఘం ముఖ్యుల సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: గౌడ గర్జన మహాసభ జరగనున్న నేపథ్యంలో ఈనెల 9న ఏలూరులోని ఆర్ ఆర్ పేట కస్తూరి వారి వీధిలో గల నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిట్టి బొమ్మ రంగారావు తెలిపారు. ఆదివారం ఆయన స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గౌడ జాతి అభివృద్ధి, సమస్యల పరిష్కారం నిమిత్తం మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. చట్టసభలలో గౌడ కులస్తులకు వారి అనుభవాలను బట్టి రాజకీయ పదవులు ఇచ్చే విధంగా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. గౌడ కుల అభివృద్ధికి అందరం ఐకమత్యంగా పోరాడాలని రంగారావు పిలుపునిచ్చారు. కాగిత అచ్యుత పూలే, మాజీ కార్పొరేటర్ వీరంకి త్రినాథ్ గౌడ్, ఏలూరు నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షులు ఎరకల సూరిబాబు, ప్రధాన కార్యదర్శి వీరంకి పండు, కోశాధికారి మోదుగుమూడి శివరామకృష్ణ, రూరల్ మండల అధ్యక్షులు మరీదు శ్రీనివాసరావు, ఏలూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షులు బాలిపోయిన నవ హర్ష పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల అందజేత

విశాలాంధ్ర-ముసునూరు: పదోతరగతి విద్యార్థినులు మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నూజివీడు డివిజన్ నాయకులు పర్వతనేని గంగధరరావు, అక్కినేని చందు అన్నారు. ఆదివారం మండలంలోని ముసునూరు గురుకుల పాఠశాల్లో చదువుతున్న 80మంది విద్యార్థినులకు ప్యాడ్స్, పెన్నులు జామెంట్రీ బాక్సులు అందజేశారు. పాలడుగు చిన్ని, హెచ్ఎం యార్లగడ్డ శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర- ముసునూరు: మట్టల ఆదివారం పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, రక్షణ సైన్యం చర్చి పాస్టర్ కెప్టేన్ ఎం.రాజువనిత ఆధ్వర్యంలో మట్టలతో ప్రత్యేక అలంకరణలతో ర్యాలీ నిర్వహించి, గీతాలు ఆలపించారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, బెరాక, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

అవార్డ్ అందుకున్న డాక్టర్ బాబూరావు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి డాక్టర్ మల్లిపూడి చిన బాబురావు ఆదివారం విశ్వగురు ఉగాది పురస్కార అవార్డును అందుకున్నారు. ఈ విషయాన్ని ఆయన విలేకరులకు తెలిపారు. పశు సంవర్ధక శాఖలో విశేష సేవలు అందించినందుకు ఆయనకు ఆయనకు ఈ అవార్డును హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో అందజేశారు.

ఘనంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మట్టల ఆదివారం సందర్భంగా పురవీధులలో క్రైస్తవ సోదరులు ఈత మట్టలతో ఊరేగింపును కొనసాగించారు. మండలంలో కొయ్యలగూడెం, పొంగుటూరు, వివిధ గ్రామాలలో క్రైస్తవ సోదరులు చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

స్వామి వారి సన్నిధిలో హైకోర్టు జడ్జి



విశాలాంధ్ర-భీమవరం టౌన్: భీమవరం గునుపూడిలోని శ్రీ సోమేశ్వర జనార్థన స్వామి వార్ల దేవస్థానాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి డి.వెంకట రమణ స్వామి దర్శించారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమం నిర్వహించారు.

డాక్టర్ పట్టాకు సత్కారం



విశాలాంధ్ర-భీమవరం: క్రైస్తవ సమాజానికి డాక్టర్ పట్టా దేవరాజ్ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని వక్తలు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆంధ్రా థియొలాజికల్ కళాశాల పట్టణానికి చెందిన డాక్టర్ పట్టా దేవరాజ్ కు థియాలజీలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆదివారం బేతనీపేటలో క్రైస్తవ నాయకులు పట్టా దేవరాజ్‌ను సత్కరించారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్, ఎ.ఎస్.ఆర్.శాస్త్రి, పి.సుదర్శన్, పి.జె.కెనడి, పి.జె.మణిలాల్, పి.కెజియ, పి.జ్ఞానసుందరి తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ వంగపండుపై విచారణ నేడు

విశాలాంధ్ర-ఏలూరు: నగరపాలక సంస్థలో డీఈఈగా పనిచేస్తున్న వంగపండు సత్యనారాయణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నేడు పీహెచ్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విచారణ జరుపుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని గతంలో ఏసీబీ వలలో చిక్కి జైలు జీవితం అనుభవించిన వంగపండు సత్యనారాయణ తిరిగి ఏలూరు కార్పొరేషన్‌లో డీఈఈగా ఏ జీవో ఆధారంగా పనిచేస్తున్నారని ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పీహెచ్ విభాగానికి చెందిన ఇంజనీర్ ఇన్ చీఫ్, రాజమండ్రి పీహెచ్ విభాగానికి చెందిన ఎస్ఈ ఉత్వరులపై సోమవారం విచారణ జరుగుతుందని తెలిపారు. విచారణ న్యాయబద్ధంగా జరగాలని కోరారు.

పరీక్షలకు 510 మంది విద్యార్థులు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలలో 510 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారని జీలుగుమిల్లి మండల విద్యాశాఖ అధికారి కే శ్రీనివాసరావు తెలిపారు. జీలుగుమిల్లి మండలంలో 10 పాఠశాలలు, టీ నర్సాపురం మండలం మర్రిగూడెం ఒక పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 412 మంది విద్యార్థులు రెగ్యులర్, 98 మంది ప్రైవేటుగా విద్యార్థులు హాజరు అవుతారని తెలిపారు. జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో 187 మంది బర్రింకలపాడు గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3 23 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు 9:30 గంటల లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు.

'గడప' గుబులు

- నేతల్లో అలజడి
- టికెట్లపై స్పష్టత ఇస్తారని చర్చ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకోబోతోంది. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అన్ని స్థానాలని కైవసం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల నుంచి వచ్చిన స్పందన ఆధారంగా తమ వ్యూహాన్ని మార్చుకోనున్నట్లు సమాచారం. పార్టీ యంత్రాంగం ఇచ్చే రిపోర్టులతో పాటు ఇంటిలిజెన్స్ నివేదికలు, ఇతర నివేదికలను ముఖ్యమంత్రి జగన్ పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఇటీవల ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ముందస్తు ఎన్నికలకు వెళతారని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలలో ఆందోళన నెలకొంది. ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు అవసరమైన అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకోవడంతో పాటు చేసిన అభివృద్ధి పనులు చెప్పుకోవాల్సిన పరిస్థితులు అధికార పార్టీ నేతలకు ఎదురైనాయి. దీంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రాఫ్ పెంచుకోకపోతే గ్రాఫ్ తక్కువగా ఉందని సీట్లు ఇచ్చే విషయంలో ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గతంలో జరిగిన గడపగడప సమీక్ష సమావేశాలలో ముఖ్యమంత్రి సూచనప్రాయంగా హెచ్చరించడంతో ఆందోళన నెలకొంది. ఈనెల 3న విజయవాడలో ముఖ్యమంత్రి జగన్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలతో నిర్వహించే సమావేశంలో ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎమ్మెల్యేలపై పెరిగిన నిఘా

ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్న నేపథ్యంలో వైసీపీ లీడర్లపై ఫోకస్ పెరిగింది. అధికార పార్టీలో ఉండేది ఎవరు..? వైసీపీని వీడేది ఎవరు..? అనే విషయంపై వైసీపీ బాస్ ఫోకస్ పెంచినట్లు అధికార పార్టీ నేతలలో ఆందోళన పెరిగింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతల కదలికలపై నిఘా పెట్టినట్లు అనధికార సమాచారం. ఎవరు ఎవరితో టచ్‌లో ఉన్నారు. ఎక్కడ కలుస్తున్నారు. అనేదానిపై పక్కా సమాచారం సేకరిస్తున్నారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ముఖ్య అనుచరులతో పాటు వ్యక్తిగత సిబ్బంది పైన హైకమండ్ నిఘా పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు ఇంటిలిజెన్స్‌తో పాటు, అనేక ఏజెన్సీలు కూడా పనిచేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గడపగడపకుపై ఫోకస్

ఈక్రమంలోనే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంపై ఫోకస్ పెట్టింది. నియోజకవర్గాలలో ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అనే ఆరా తీయాలని ఇప్పటికే ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. అయితే జిల్లాలో ఈ కార్యక్రమం మొదటి నుంచి కూడా మొక్కుబడిగానే సాగుతోంది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పనితీరుపై ముఖ్యమంత్రి జగన్ అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భం ఉంది. సోమవారం తాడేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వర్క్‌షాప్ నిర్వహణకు సిద్ధం అయ్యారు. ఎమ్మెల్యేలంతా నేటి నుంచి మళ్లీ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ఉన్న స్పందన తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఐపాడ్ నివేదికల ఆధారంగా ఎవరు ఎలా పనిచేస్తున్నారు. నివేదికల ఆధారంగానే రేపు జరగబోయే వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఏది ఏమైనా ముందస్తు ఎన్నికల అంశం అధికార పార్టీ శ్రేణులను కలవరపరుస్తోంది.

14నుంచి వామపక్షాల రాజకీయ ప్రచారభేరి

విశాలాంధ్ర-భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల14 నుంచి 30 వరకు చేపట్టనున్న రాజకీయ ప్రచార ఉద్యమ భేరిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి బీ బలరాం పిలుపునిచ్చారు. మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో వారు పాలకుల తీరును తూర్పారాబట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. రాష్ట్రంలోని విశాఖ ఉక్కును సైతం కారు చౌకగా కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారని కేంద్రాన్ని అడ్డుకుంటామన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేస్తూ, వాటిని నాలుగు కోడ్‌లుగా మార్చివేసి కార్మికులను రోడ్డు మీదకు లాగారని కోనాల ఆవేదన వ్యక్తం చేశారు. నాడు నిత్యావసరాల ధరలు, గ్యాస్ ధరలు తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి వాటి మాటే మర్చిపోయారన్నారు. అలాగే ప్రతిపక్ష నాయకులపై దాడులు, అరెస్టులు చేస్తూ తన నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. అభ్యుదయ వాదులు, మీడియా పై భౌతిక దాడులు, ప్రాణాలు తీసేలా సంఘ్ పరివార్ వ్యవహరిస్తోందని దేశంలో పరిస్థితి అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని ప్రజా పోరాటాలతోనే వీటిని అడ్డుకుంటామని కోనాల హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలని ముమ్మరంగా అవలంభిస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలు, పేదలకు వ్యతిరేకమైన విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో నాయకుల అవినీతి గూర్చి మోదీ, అమిత్‌షా ఒక్క మాట చెప్పడంలేదన్నారు. కానీ నిరంకుశంగా ప్రతిపక్షాల మీద, ప్రతి పక్ష నాయకుల మీద దాడులు చేస్తున్నారన్నారు. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్ష నాయకులు, హక్కుల కార్యకర్తలు, గొంతెత్తి అడుగుతున్న వారి మీద సీబీఐ, ఈడీలతో దాడులు చేసి, 3500లకు పైగా కేసులను నమోదు చేశారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిధులు, నిర్వాసితుల సమస్యలు, రాజధాని నిర్మాణానికి నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఊసే లేదన్నారు. ఉన్న పరిశ్రమలను మూసివేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరల్ని అరికట్టడం లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా కనీసం నోరు మెదపడం లేదన్నారు. వారిని ఒకసారి ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని, హోమ్ మంత్రిని కలిసి పుష్పగుచ్చం, దేవుడి బొమ్మ పెట్టి రావడం తప్ప వాటి వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఈ నెల 14న మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబెడ్కర్ జయంతి సందర్భంగా అయన విగ్రహాలకు పూలమాలలు వేసి అక్కడి నుండే రాజకీయ ప్రచార ఉద్యమ భేరిని ప్రారంభిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాయకులు చెల్లబోయిన రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.ఎన్.విగోపాలన్, బి. వాసుదేవరావు, కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

ఊపందుకుంటున్న స్థానికత నినాదం

విశాలాంధ్ర-లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గంలో స్థానికతపై బలమైన నినాదం ఊపందుకుంటుంది. ఎక్కడో ఉండి.. ఎక్కడి నుంచో తీసుకువచ్చిన వారికి టికెట్లు ఇస్తే చూస్తూ ఊరుకోమంటూ నియోజకవర్గంలోని అధికార వైసీపీలోనూ.. ప్రతిపక్ష టీడీపీలోనూ బలమైన పోరాటానికి బీజం పడింది. ఈ వాదనపై పార్టీలు తీసుకునే నిర్ణయం ఎలా ఉండబోతుందో సంగతి అలా ఉంచితే స్థానికతపై నియోజకవర్గంలో చకచకా వ్యూహాలు వేస్తున్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు మాపై పెత్తనం చేస్తూ మా మధ్య చిచ్చు పెడుతుంటే చూస్తూ ఊరుకోవాలా ? అంటూ ప్రశ్నిస్తున్నారు. స్థానికేతరులను, మైగ్రేడంటూ వస్తున్న వారిని ప్రోత్సహిస్తే వారికి తాము ఎందుకు ఊడిగం చేయాలని ప్రశ్నిస్తున్నారు. నిత్యం ప్రజల మధ్య ఉన్న వారంతా సాకిరి చేయటానికి సిద్ధంగా లేమని ఘాటుగానే తమ వాదనపై పోరాడతామని అంటున్నారు. నియోజకవర్గంలో కొందరు నాయకులు స్వార్థం కోసం స్థానికేతరులను ప్రోత్సహిస్తూ ఆ తరువాత వారిపైనే ఎదురు తిరుగుతున్న సంఘటనలు కళ్ళముందే ఉన్నాయని, దీనిని ప్రతీ ఒక్క రాజకీయవాది గమనించాలని స్థానికతను వినిపించేవారు కోరుతున్నారు. రాజకీయ చరిత్ర కలిగిన నియోజకవర్గంలో మాల, మాదిగ సామాజిక వర్గాలలో విద్యావంతులు, ఆర్థికంగా పట్టు ఉన్న వారు, రాజకీయాలలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికే రాబోయే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని, స్థానికతకు ప్రాధాన్యమిచ్చి ఏ కులం అభ్యర్థిని ఎవరిని నియమించినా పార్టీ అధిష్టానానికి కట్టుబడి పార్టీ కోసం పనిచేస్తామని, స్థానికతను ఉల్లంగించిన పార్టీకి తమదైన శైలిలో సమాధానం చెబుతామని అంటున్నారు. అప్పటికి.. ఇప్పటికీ చూస్తే ఇప్పుడు ఎంతో అభివృద్ధిలో ఎస్సీలు ఉన్నారు. అటువంటి వారిని కాదని స్థానికేతరులను తెస్తే ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. దీనిపై పార్టీల అధిష్టానమే నిర్ణయించుకోవాల్సి ఉందని అంటున్నారు.

కుటుంబంపై కత్తులతో దాడి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన తోనం శివ అతని భార్య తోనం చిన్ని కుమారుడు తోణం మంగరాజులపై ఈనెల 1వ తేదీ శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బలమైన ఆయుధంతో దాడి చేయడంతో వారి ముగ్గురి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి ఉన్న వారిని గమనించిన స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐ బాల సురేష్ బాబు,ఎస్ ఐ సాగర్ బాబు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా క్లూస్ టీమ్,డాగ్స్ స్క్వాడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించాయి. మైసన్నగూడెం నుండి డాగ్ స్క్వాడ్ మండలంలోని వేగవరం గ్రామానికి తీసుకువెళ్ళాయి. అక్కడ ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వేగవరానికి చెందిన నిందితుడు రామ కృష్ణ బాధితుడు తోనం శివ ఇద్దరూ స్నేహితులని తెలిసింది. 24 గంటలు దాటకుండానే నిందితుడిని పట్టుకోవడం లో జంగారెడ్డిగూడెం సిఐ బాల సురేష్ బాబు, ఎస్ ఐ సాగర్ బాబు చేసిన కృషికి పలువురు అభినందిస్తున్నారు.

భీమవరం పట్టణ టీడీపీ నూతన కమిటీ

విశాలాంధ్ర-భీమవరం: భీమవరం పట్టణ టిడిపి నూతన కార్యవర్గ ప్రథమ సమావేశం ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతా రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించి కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ భీమవరం పట్టణ తెలుగుదేశంపార్టీ కార్యవర్గ కమిటీలో పదిమంది సభ్యులను ఎంపిక చేయడమైనదని కమిటీ అధ్యక్షునిగా క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యక్షులుగా తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన లంకి శ్రీనివాస్ (చిన్ని), ప్రధాన కార్యదర్శిగా శెట్టిబలిజ సామాజ వర్గానికి చెందిన గూడూరి సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గోల్తి పాండురంగచారి (విశ్వబ్రాహ్మణ), ఎండి అస్లాంభాష (ముస్లింమైనారిటీ), నేదునూరి గంగాధర్ (రజక), కార్యదర్శులుగా బేతసబట్ల పద్మ (బ్రాహ్మణ), సారిక ఆంజనేయులు (నాయిబ్రాహ్మ), బొత్స వెంకటరమణ (రెల్లి), కోశాధికారిగా కొల్లిపాకుల దుర్గాప్రసాద్ (వైశ్య) లను నియమించుకోవడం జరిగిందని కార్పొరేషన్ గా మారనున్న భీమవరం పట్టణంలోని మిగిలిన సామాజిక వర్గ కులాలకు చెందిన టిడిపి నాయకులను విలీన గ్రామాలకు చెందిన టిడిపి వారిని కమిటీలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. టీడీపీ నాయకులు మామిడిశెట్టి ప్రసాద్, మైలబత్తుల ఐజాక్ బాబు, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమ బేగం, చెల్లబోయిన సుబ్బారావు, ఎరకరాజు గోపాలకృష్ణంరాజు, వీరవల్లి శ్రీనివాస్, రేపు వెంకన్న, కౌరు పృధ్విశంకర్, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, మలువలస రాము, వీరవల్లి సూరిబాబు, బొక్క సూరిబాబు, కొండ్రు శ్రీనివాస్, పంతం వెంకటసతీష్, ఎండి నౌషాద్, గునుపుటి తిరుపాల్ ఎండి షాభు, ఎస్కే రబ్బాని, ఎండి ఫిరోజ్, చెల్లబోయిన కిరణ్ కుమార్, ములుగుర్తి శివాని, పంపన సుధాకర్, కొయ్యలగడ్డ గణపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా గుంటూరి

విశాలాంధ్ర-పోడూరు: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్, పోడూరు మండల జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు నియమితులయ్యారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చేరి పోడూరు మండలంలో పార్టీని అడుగడుగునా విజయపథంలో నడిపించటమే కాకుండా ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలో పార్టీ అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న గుంటూరి పెద్ది రాజుకి క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల పోడూరు మండలానికి చెందిన పార్టీ శ్రేణులు, ఆచంట, పాలకొల్లు నియోజకవర్గం లోని పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గుంటూరి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నూజివీడు డీవైఈవో ఎం సేవ్యా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 3, 478 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. నూజివీడు మండలంలో 1789 మంది, ముసునూరు మండలంలో 619 మంది, చాట్రాయి మండలంలో 471 మంది, ఆగిరిపల్లి మండలంలో 599 మంది విద్యార్థులుపరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 15 కేంద్రాలను ఏర్పాటు చేయగా వీటిల్లో నాలుగు సీ క్యాటగిరి కేంద్రాలు కాగా, నూజివీడు మండలంలో 2, ముసునూరు మండలంలో 2 కేంద్రాలు ఉన్నయని డివైఓ తెలిపారు. ఏప్రిల్ మూడో తేదీ నుండి 18వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి అన్నారు. ఈ ఏడాది సైన్స్ సబ్జెక్టు మినహా మిగిలిన అన్ని సబ్జెక్టులకు ఒక్కొక్క పేపరు మాత్రమే ఉంటుందన్నారు. మాస్ కాపీయింగ్ నిరోధానికి పేపర్ల లీకేజీ అరికట్టడానికి ప్రభుత్వం ప్రతి పరీక్ష పేపర్ మీద ఏడంకెల నెంబరు ముద్రించ బడి ఉంటుందన్నారు. విద్యార్థులు ఎలాంటి అపోహలకు, ఆందోళనకు లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి విజయం సాధించాలని విద్యార్థులను డివైఈవో కోరారు.

పరీక్షలపై అవగాహన

విశాలాంధ్ర- లింగపాలెం: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు మిత్రదీప్ సంస్థ వ్యవస్థాపకులు సొంగా సందీప్ అవగాహన కల్పించారు. ధర్మాజీ గూడెం వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు కల్పించిన ఈ అవగాహనలో సహాయ సంక్షేమ అధికారి మంగరత్నం, వార్డెన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ పరీక్ష కిట్‌లను విద్యార్థులకు బహుకరించారు.

వైసీపీకి శ్రీనివాస్ గుడ్‌బై?

విశాలాంధ్ర-ఆకివీడు: ఆకివీడు పట్టణ వైసీపీ మాజీ అధ్యక్షుడు శిరపు శ్రీనివాస్ వైసీపీకి, పట్టణ జేసీఎస్ఎస్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం కలకలం సృష్టించింది. ఈ విషయం ఆయన తన మొబైల్ వాట్సాప్ స్టేటస్‌లో తెలపడంతో ఆకివీడు పట్టణ నాయకులు, కార్యకర్తల్లో అలజడి రేగింది. దీనిపై శ్రీనివాసుని వివరణ అడగ్గా అధికారంలో ఉండి, చిన్న చిన్న పనులు కూడా చేయించుకోలేనప్పుడు అధికార పార్టీలో పదవులు అవసరం లేదు అనే బాధతో స్టేటస్ పెట్టుకున్నా అని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-టీ నరసాపురం: పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కే సతీష్ కుమార్ తెలిపారు. మండలంలోని శింగరాయిపాలెంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి నిర్వాహకుల నుంచి రూ.50,350 స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలిపారు.

నలుగురు వ్యక్తుల అరెస్ట్

విశాలాంధ్ర జీలుగుమిల్లి: కోడిపందేలపై దాడి చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జీలుగుమిల్లి ఎస్ఐ వి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం దర్భ గూడెం పంచాయతీ పరిధిలోగల సీమల వారి గూడెం గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. వీరి వద్దనుండి ఒక పందెంకోడి, రూ. 1200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

నూతన వస్త్ర వేడుకకు పర్వతనేని

విశాలాంధ్ర-చాట్రాయి: టీడీపీ సీనియర్ కార్యకర్త పలగాని రఘుపతి నివాసంలో నూతన వస్త్ర లంకరణ వేడుకకు టీడీపీ నూజివీడు నియోజకవర్గ నాయకులు పర్వతనేని గంగాధర్ చిన్నారిని ఆశీర్వదించారు. ఆదివారం చాట్రాయి మండలం పర్వతాపురంలో టీడీపీ సీనియర్ కార్యకర్త పలగాని రఘుపతి మనవరాలు నూతనవస్త్ర అలంకరణకు పర్వతనేని ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. టీడీపీ మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న వాసుబాబు

విశాలాంధ్ర-నిడమర్రు: పెద నిండ్ర కొలనులో శ్రీ వేణు గోపాల స్వామి పంచాహ్నిక దివ్య కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిడమర్రు జడ్పిటిసి సభ్యులు కోడే కాశీ, సంకు సత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేలు జాతి పశువుల అభివృద్ధికి దోహదం

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: మండలంలోని పాడి రైతులకు ఎక్కువ ఆదాయం, మేలు జాతి పశువుల అభివృద్ధికి ఉచిత గర్భాధారణ ఇంజక్షన్లు ఎంతగానో ఉపయోగపడతాయని జీలుగుమిల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం సాయిబుచ్చారావు అన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి జులై ఆఖరి వరకు పాడి పశువులకు ఉచిత గర్భాధారణ ఇంజక్షన్లు ఉచితంగా అన్ని ప్రభుత్వ పశువైద్యశాలలలో రైతు భరోసా కేంద్రాలలో వేయనున్నట్లు అని తెలిపారు. రైతులు ఈ ఉచిత గర్భాధారణ ఇంజక్షన్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్యాన్సర్ రోగికి రూ.15 వేల ఆర్థిక సహాయం



విశాలాంధ్ర-ముదినేపల్లి : క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్న మహిళ కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు ఆమెకు రూ 15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ముదినేపల్లి మండలం చినపాలపర్రు గ్రామానికి చెందిన పాస్టర్ కొరగంటి రత్నరాజు భార్య అన్నామణికి టీడీపీ యువ నాయకులు కొడాలి వినోద్ రూ.15 గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఊసల గాలిబాబు చేతుల మీదుగా అందజేశారు. నాయకులు పంతగాని సురేష్ , ఆరుగళ్ల సుబ్బారావు , ఉప్పల పణి కుమార్, ఈడే కృష్ణ, పరసా రాజు , కోగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-కలిదిండి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందెందుకు జగనన్న కృషి చేస్తురని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైయస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో జరిగిన మూడో విడత పంపిణీ ఉత్సవాలలో పాల్గొన్నారు. మహిళలు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తహసిల్దార్ తేజో మణి, ఎంపీడీవో సీతారామకుమార్, ఏపీఎం రవికుమార్, ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, జడ్పిటిసి బొర్రా. సత్యవతి, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని. రమేష్, సర్పంచ్ మసిముక్కుల. మారుతి ప్రసన్న, ముదిరేపల్లి ఏపిఎం సత్యనారాయణ, సిసిలు, వివోఏలు, బుక్ కీపర్లు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము. రవికుమార్ నంబూరి. శ్రీదేవి పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర-లింగపాలెం: మట్టల ఆదివారాన్ని క్రైస్తవ విశ్వాసులు లింగపాలెం మండలంలో భక్తితో నిర్వహించారు. వచ్చే శుభ శుక్రవారానికి ముందు క్రీస్తు ఏకాంత ప్రార్ధనలు చేసి వచ్చినప్పుడు మట్టలకు పువ్వులు గుచ్చి గాడిదపై క్రీస్తుని ఊరేగిస్తారని, దీనిని క్రైస్తవులు ప్రతీ ఏడాది సంప్రదాయంగా ఆచరిస్తారని మత గురువులు తెలిపారు. మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ఏసుక్రీస్తు ప్రభువు సిలువ మరణం పొందకముందు చివరిసారిగా యెరుషలేము సందర్శించిన దినాన్ని మట్టలాదివారం ముదినేపల్లి మండలంలోని అన్ని చర్చిలలో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్సీఎం చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో , ఎల్ఈఎఫ్ చర్చిలో బ్రదర్ ఫ్రాన్సిస్, మేరీ చర్చి, షాలేము చర్చిలో ఏసురత్నం, సి.ఎస్.ఐ, బాప్టిస్ట్, సాల్వేషన్ ఆర్మీ, ఇమ్మానుయేల్ చర్చిల్లో ఉచ్చుల విజయకుమార్, వైవాక, సింగరాయపాలెం, చిగురుకోట, కోడూరు, పెదపాలపర్రు, గురజ, చర్చిలలో పిల్లలతో కలిసి పూలతో గుచ్చిన ఈత మట్టలు చేత బట్టి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.